క్లుప్తంగా

శ్రీరాముని అక్షింతలు పంపిణీ



తెనాలిటౌన్: ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని మందిరం ప్రారంభం సందర్భంగా ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు శనివారం పట్టణంలోని గాంధీనగర్‌లో శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేశారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ఇంటింటికీ వెళ్లి అక్షింతలు మహిళలకు అందజేశారు. శ్రీరాముని చిత్రపటంతో పాటు విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికలను అందజేస్తున్నారు. అయోధ్యలో జరిగే రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి తరలి రావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు శ్రీనివాసరావు,హరికృష్ణ, సాంబశివరావు, రఘురామయ్య, సీతారామయ్య, ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

తెనాలిరూరల్: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన పొన్నాల సుబ్బారావు(34)కు స్థానిక పాండురంగపేటకు చెందిన శివపార్వతితో వివాహమైంది. భార్య కొంతకాలంగా కాపురానికి రావటం లేదు.దీంతో ఇరు కుటుంబాల వారు తరచూ గొడవపడుతుండేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి అత్తింటికి వచ్చిన సుబ్బారావు భార్యను కాపురానికి రమ్మని గొడవపడ్డాడు. కాపురానికి వచ్చేందుకు భార్య నిరాకరించడంతో అత్తింట్లోనే రాత్రికి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తింటివారి తీరుపై మహిళ ఆందోళన

తెనాలిరూరల్: అత్తింటి వారు కాపురానికి రానివ్వడం లేదని ఓ మహిళ ఆందోళనకు దిగింది. తల్లిదండ్రులతో కలసి అత్తింటికి వచ్చి బాధితురాలు ఆందోళన చేసింది. బాధితురాలు, ఆమె తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్‌కు చెందిన జరుగు సీతారాం, కోటేశ్వరి దంపతుల కుమార్తె రమ్యశ్రీకి బాలాజీరావుపేటకు చెందిన బర్మా రవికిషోర్‌కు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. పెళ్లైన తర్వాత ఐదు నెలల గర్భిణిగా ఉన్న సమయంలో పుట్టింటికి వచ్చిన రమ్యశ్రీని తిరిగి కాపురానికి రానీయడం లేదని వారు ఆరోపించారు. వివాహ సమయంలో ఎకరం పొలం, రూ.10 లక్షల కట్నం ఇచ్చామని చెప్పారు. రవికిషోర్ తల్లిదండ్రులు శివనాగేశ్వరరావు, మాధవి, ఆడపడుచు తమ కుమార్తెను కాపురానికి రానివ్వడంలేదని, న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించామని తెలిపారు. తాము కాపురానికి తీసుకెళ్లమని అడుగుతుంటే రవికిషోర్ కుటుంబ సభ్యులు విడాకులు కోరుకుంటున్నారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చేబ్రోలు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రమైన చేబ్రోలులోని డాన్‌బాస్కో స్కూల్ సమీపంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చేబ్రోలు నుంచి నారాకోడూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ప్రమాదవశాత్తూ కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో పాత గుంటూరు ప్రాంతానికి చెందిన ఎ.రాఘవ, చేబ్రోలుకు చెందిన ప్రసాద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. కాళ్లు విరిగిన ఇద్దరిని చేబ్రోలు, వట్టిచెరుకూరు 108 వాహనాల ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హిందూ ఫార్మసీలో సంక్రాంతి సంబరాలు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో అందమైన రంగవల్లులు తీర్చిదిద్ది భోగి మంట వేశారు. అధ్యాపకులు, విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్నారు. గ్రామీణ వాతావరణన్ని తలపించే విధంగా బొమ్మల కొలువు, గాలిపటాలను ఎగరవేశారు. కళాశాల అధ్యాపకులు జి.ఇందిరా ప్రియదర్శిని, వి.మౌనిక, డాక్టర్ ఎ.ప్రత్యూష పర్యవేక్షణలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదన్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎంజేలో దివ్యాంగుల దినోత్సవం

గుంటూరు రూరల్: విభిన్న ప్రతిభావంతులుగా ఉన్న ప్రతి ఒక్కరూ అన్ని రంగాల్లో రాణించాలని విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ తెలిపారు. శుక్రవారం నల్లపాడు గ్రామంలోని జేఎంజే సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఏదో టాలెంట్ ఉంటుందని, దానిని వెలికి తీసి ఉన్నత శిఖరాలను చేరేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేయాలన్నారు.

సరికొత్త హంగులతో రూపుదిద్దుకున్న ఇండోర్

- స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌కు విద్యుత్తు సౌకర్యం
- ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్



వాకర్స్‌తో కలిసి నడుస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పట్టణ చెంచుపేటలోని అన్నాబత్తుని సత్యనారాయణ ఇండోర్ స్టేడియంను అన్ని క్రీడలకు అనువైన వేదికగా తీర్చిదిద్దినట్టు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. తెనాలి, పరిసరాల్లోని క్రీడాకారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్టేడియంలోని వాకర్స్ అసోసియేషన్ చేసిన వినతితో ఎమ్మెల్యే శివకుమార్ స్టేడియం ప్రాంగణంలోని వాకింగ్ ట్రాక్ చుట్టూ 50 విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. వాకర్స్, ఏరోబిక్స్ సభ్యులు, క్రీడాకారుల సమక్షంలో ఈ లైటింగ్ సదుపాయాన్ని శనివారం రాత్రి ఎమ్మెల్యే శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం కేవలం షటిల్ బ్యాడ్మింటన్‌కు మాత్రమే పరిమితం కారాదన్న భావనతో తగిన మౌలిక సదుపాయాలు కల్పించి, శిక్షకులను నియమించినట్టు చెప్పారు. వాలీబాల్, హ్యాండ్‌బాల్ కోర్టులు, వెయిట్ లిఫ్టింగ్ హాలు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌ను తీసుకొచ్చామని తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ విజ్ఞప్తితో చుట్టూ లైటింగ్ సౌకర్యాన్ని కల్పించామన్నారు. స్టేడియంలో రూ.70 లక్షలతో హాస్టల్, కిచెన్, డైనింగ్ హాలును నిర్మించి, రాష్ట్రంలోనే తొలిసారిగా ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో హ్యాండ్‌బాల్ క్రీడా అకాడమీని తీసుకురాగలిగినట్టు గుర్తుచేశారు. అకాడమీ శిక్షణలో ఒక క్రీడాకారుడు అంతర్జాతీయ పోటీలకు హాజరైనట్టు తెలిపారు. మరికొందరు జాతీయ పోటీల్లో పాల్గొన్నట్టు వివరించారు. అన్ని రకాల క్రీడలకు అనువైన స్టేడియంలో వసతుల కల్పనకు ఎంతోమంది దాతలు సహకరించారని, వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. వార్డు కౌన్సిలరు మట్లపూడి సంధ్యారాణి, కోచ్‌లు కె.నాగరాజు, గోపీనాథ్, రాజేంద్రకుమార్, స్థానికులు పాల్గొన్నారు.

శ్రీ భావన్నారాయణ స్వామి సన్నిధిలో అలరించిన భక్తి గీతాలాపన



గీతాలాపన చేస్తున్న గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్



కార్యక్రమాన్ని తిలకిస్తున్న కోన రఘుపతి దంపతులు

హాజరైన ఎమ్మెల్యే కోన దంపతులు

బాపట్ల: సంక్రాంతి పండుగ సందర్భంగా కోన ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక శ్రీ భావన్నారాయణస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన భక్తి గీతాలాపన శనివారం రాత్రి వీనులవిందుగా సాగింది. తిరుమల, తిరుపతి దేవస్థానం, అహోబిలం కంచికామకోటి పీఠం ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌చే చేపట్టిన భక్తి గీతాలు ప్రేక్షులను ఆకట్టుకున్నాయి. శ్రీ వేంకటేశ్వరస్వామి వైభవం, కీర్తనలు అలరించాయి. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, ఆయన సతీమణి రమాదేవి కార్యక్రమాన్ని ప్రారంభించారు.తొలుత శ్రీ భావన్నారాయణస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంక్రాంతి జీవితాల్లో వెలుగులు నింపాలి: సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, పాడి పంటలతో అంతా తులతూగాలని ఎమ్మెల్యే కోన రఘుపతి ఆకాంక్షించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది సైతం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ భావన్నారాయణస్వామి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ప్రజలంతా అభ్యున్నతి దిశగా అడుగులు వేయాలని దేవుడిని కోరినట్లు చెప్పారు.

పండుగలు సంప్రదాయాలకు ప్రతిబింబాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

కర్లపాలెం: పండుగలు దేశ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలని బీజేపీ జిల్లా నాయకులు, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. సతీష్ ఫుడ్ మెరైన్ కంపెనీలో శనివారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో యువకులు, మహిళలు పాల్గొన్నారు. పలు రకాల ఆటలలో విజేతలకు బహుమతులు అందజేశారు. భోగి మంటలు వేసి సంక్రాంతి పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ పంటలు బాగా పండి రైతుల ముంగిళ్లు ధాన్య రాశులతో నిండిన సమయంలో అంతా ఆనందోత్సాహాలతో చేసుకునే పండుగ సంక్రాంతి అని వివరించారు. ఈ కార్యక్రమంలో చాయిస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ జోస్, సతీష్ ఫుడ్ మెరైన్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

టాంగో సూడో క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో వైఎస్సార్‌సీపీ నాయకులు

తెనాలిఅర్బన్: 10వ టాంగో సూడో నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో తెనాలిలోని కేఎస్ఆర్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ఆరాధ్యుల చరణ్, షేక్ భాషా, పి బెన్ని రాజశేఖర్‌లు రజిత పతకాలు సాధించగా, టి సత్య జశ్వంత్, ఎస్ జ్ఞాన తేజలు క్యాంస పతకాలు సాధించినట్లు కోచ్ కె వెంకటేశ్వరరావు తెలిపారు. పోటీలను ఢిల్లీలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించినట్లు చెప్పారు. శనివారం ఆకాడమీ ఆవరణలో వారిని అభినందించి సర్టిఫికేట్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తెనాలి క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, కొత్త రామారావు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



ఎస్ఐ చంద్రశేఖర్

భట్టిప్రోలు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భట్టిప్రోలు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ శనివారం తెలిపారు.కోడిపందేలు, జూదాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా కోడిపందేలు ఆడినా, ఆడించినా, కోళ్లకు పందేలు నిమిత్తం కత్తులు కట్టినా, కోడిపందేలకు ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

కోడి పందేల నిర్వహణ చట్టరీత్యా నేరం

చుండూరు(వేమూరు): మండలంలో కోడి పందేలు నిర్వహించే నిర్వాహకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మండలంలో కోడి పందేలు, పేకాటలు నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ప్రజలంతా సంక్రాంతి పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు.

కోడి పందేల బరి పనులు నిలిపివేత



కోడి పందేల బరి వద్ద పహారా కాస్తున్న పోలీసులు

కొల్లూరు : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందేల నిర్వహణ ఏర్పాట్లను పోలీసు, రెవెన్యూ యంత్రాంగం నిలుపు చేశారు. మండలంలోని పెసర్లంక పరిధిలోని ఇటుక కల్లాల ప్రాంతంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా కోడి పందేలు వేసేందుకు నిర్వాహకులు బరి ఏర్పాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. సమాచారం అందుకున్న కొల్లూరు తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఎస్ఐ రాజ్యలక్ష్మి సిబ్బందితో కలసి పందేల కోసం ఏర్పాట్లు చేస్తున్న ప్రాంతానికి హుటాహుటిన చేరుకున్నారు. ఏర్పాట్లను నిలుపు చేయించారు.

పేకాట శిబిరంపై పోలీసు దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి మండలం తేలప్రోలు శివారు డంపింగ్ యార్డు వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో శనివారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1750లు, మూడు బైకులు స్వాధీనపరుచుకున్నారు.నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ధ్వజస్తంభ జీర్ణోద్ధరణ పనులు

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలోని మూడు వందల ఏళ్ల నాటి వేణుగోపాలస్వామి ఆలయం ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరింది. దీంతో గ్రామానికి చెందిన డి.ప్రభాకర్‌రావు, భువనేశ్వరి దంపతులు నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు విరాళం అందజేశారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవో గాదె రామిరెడ్డి, ఆలయ ధర్మకర్త లక్ష్మారెడ్డిలు నూతన ధ్వజాన్ని రేపల్లె ప్రాంతం నుంచి గ్రామానికి తీసుకువచ్చారు. కొద్ది రోజులుగా పనివారు దానిని చెక్కుతున్నట్లు ఈఓ రామిరెడ్డి శనివారం తెలిపారు. పనులు పూర్తి అయిన తర్వాత నూతన ధ్వజస్తంభాన్ని వైఖానస శాస్త్రయుక్తంగా ప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు.

అంతర కళాశాలల పోటీల్లో 'హిందూ' విద్యార్థినుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన అంతర కళాశాలల పోటీల్లో గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు తెలిపారు. శనివారం సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వక్తృత్వ పోటీలో జీఎల్‌వీ అంజన ప్రథమ బహుమతి, వి.పూజిత కన్సొలేషన్ బహుమతి సాధించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంగ్ల వ్యాసరచన పోటీలో వి. పూజిత, తెలుగు వ్యాసరచనలో ఎన్. భావన తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

పుట్టలమ్మతల్లి బంగారు జడ ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తుడు చల్లా పార్థురెడ్డి, అనూరాధ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. గత ఏడాది సంక్రాంతి ఉత్సవాల్లో అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారి ప్రసాదం లడ్డును నల్లపాడు గ్రామానికి చెందిన చల్లా పార్థురెడ్డి, అనురాధ దంపతులు రూ 12.40 లక్షలకు వేలంలో కైవశం చేసుకున్నారు. అమ్మవారి ప్రసాదం లడ్డూ అందుకున్న పార్థురెడ్డి దంపతులు అమ్మవారికి బంగారు జడను తయారు చేయించి, ప్రత్యేక ఊరేగింపుగా ఆలయానికి అందజేశారు. ఊరేగింపు ఆసాంతం ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో కోలాటాలు, కర్రసాములు, తీన్‌మార్ డప్పులు, దేవతామూర్తుల వేషధారణలతో సాగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ 14వ తేదీ ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమార్చన జరుగుతుందన్నారు. సాయంత్రం కార్యక్రమాల్లో లక్ష్మీతిరుపతమ్మతల్లి కోలాట బృందం కోలాటం, మాస్టర్ మునగా సాంబశివరావు కేరళ వాయిద్యాలు, తమిళనాడు మహిళల డప్పుల వాయిద్యాలు, కర్ణాటక మహిళల డోలు వాయిద్యాలు, అమ్మవారి వేషధారణలతో అమ్మవారి ఉత్సవ మూర్తి భారీ ఊరేగింపు జరుగుతుందన్నారు. 8 గంటలకు భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

గాయకుడు జేసుదాసు జన్మదిన వేడుకలు

లక్ష్మీపురం: ప్రముఖ సినీ నేపథ్య, శాస్త్రీయ సంగీత గాయకుడు స్వరరాగ గాన ప్రవాహం జేసు దాసు 84వ జన్మదిన వేడుకలను పాడుదాం రండి సంస్థ, బృందం సభ్యుల సమక్షంలో నిర్వహించడం చాలా సంతోషదాయకంగా ఆ సంస్థ సీనియర్ సభ్యుడు, విశ్లేషకులు ఎ.అమరాచారి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జేసుదాసు జన్మదిన వేడుకలో ముందుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడుతూ భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల పాటలకు తన గాత్రం అందించిన జేసుదాసు సుమారు లక్ష పాటలు పాడారని గుర్తు చేశారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంస్థ సాంస్కృతిక విభాగాం కో-ఆర్డినేటర్ బిళ్ళా అశోక్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా ఎనిమిది సార్లు అవార్డు పొందారని, నలభైసార్లు బెస్ట్ మేల్ సింగర్‌గా కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బెంగాలీ, ప్రభుత్వాలు పురస్కారాలు అందించాయన్నారు. అనంతరం సంస్థ సభ్యులు తదితరులు జేసుదాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ముగ్గుల పోటీలకు స్పందన



పోటీలలో గెలుపొందిన విజేతలతో నిర్వాహకులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

తెనాలిఅర్బన్: సంక్రాంతి వేడుకలలో భాగంగా తెనాలి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు అచ్యుత సాంబశివరావు మాట్లాడుతూ తెలుగు వారి సంప్రదాయ పండుగలలో సంక్రాంతి ఒకటని చెప్పారు. మహిళల్లో ముగ్గులపై ఆసక్తిని పెంపొందించేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పోటీలలో గెలుపొందిన నాగరాజకుమారి, లక్ష్మి చంద్రావతిలకు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా మాజేటి శారద, కొండవీటి పద్మావతి వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి భాస్కరుని ప్రసాద్, కోశాధికారి ఎంఎస్ఆర్ గుప్తా, నాయకులు మాలేపాటి తిరుమలేశ్వరరావు, చేబ్రోలు ఆది శేషగిరిరావు, మాదల పూర్ణ, పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

రేపల్లె రూరల్: పట్టణంలోని 8వ వార్డులో వార్డుకు చెందిన పానుగుపాటి సుజాత ఆధ్వర్యంలో గుర్రం అరుణశ్రీ సహకారంతో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలను ప్రోత్సహించేందుకే పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలలో జ్యోతి, తలపాల కృష్ణ, సువర్ణలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు. ప్రత్యేక బహుమతికి గరికపాటి పల్లవి ఎంపికైంది. కార్యక్రమంలో వార్డు మహిళలు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు దుర్గాప్రసాదుకు నివాళులు



దుర్గాప్రసాద్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కళాకారులు

తెనాలి: పట్టణ రంగస్థల కళాకారుల సంఘం మాజీ అధ్యక్షుడు, ప్రజ్వలిత సంస్థ వ్యవస్థాపకుడు నాగళ్ల వెంకట దుర్గాప్రసాద్ మూడో వర్ధంతిని పురస్కరించుకొని శనివారం బుర్రిపాలెంరోడ్డులోని ఆయన కాంస్య విగ్రహానికి పలువురు కళాకారులు నివాళులర్పించారు. కళల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, ఆర్అండ్‌బీ రాజు, చిట్టూరి సీతారామయ్య, అలపర్తి వెంకటేశ్వరరావు, వెలగా సుభాష్‌చంద్రబోస్, మేరిగ రామలింగేశ్వరుడు, కొండముది రమేష్, దేవిశెట్టి కృష్ణారావు, బెల్లంకొండ వెంకట్, పందిటి సుబ్బారావు, వేము రామరాజు, తెనాలి వినయ్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

జీజీహెచ్‌లో అనుమతులు లేకుండా వ్యాపారాలు

టీ షాపులకు అనుమతులు తీసుకుని చిల్లరకొట్లు ఏర్పాట్లు



తనిఖీ చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో టీ షాపులకు, సంగం డెయిరీలకు అనుమతులు ఇస్తే వాటిస్థానంలో చిల్లరకొట్టు వ్యాపారాలు చేస్తున్నారని అలాంటి వాటిని సహించమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. శనివారం సంగం డెయిరీ షాపులను ఆయన పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో కొంతమందికి టీ షాపులు పెట్టుకునేందుకు అవకాశం ఇచ్చారని, వాటిస్థానంలో ఇతర వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి వ్యాపారాల వల్ల ఎలుకలు చొరబడేందుకు అవకాశం ఉందన్నారు. ఎముకలు, కీళ్ల విభాగం ఎదురుగా సంగం డెయిరీ షాపులో రెండు గదులను ఏర్పాటు చేసుకుని అక్రమ వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ల్యాబ్‌కు సంబంధించిన వస్తువులు ఆసుపత్రిలో రోగులకు ఉచితంగా అందిస్తుంటే, అమాయక రోగుల నుంచి రూ.5 చొప్పున వసులు చేసి దోచుకుంటున్నారన్నారు. పాదిల ప్రసాద్ బ్లాక్ ఎదురుగా టీ షాపునకు అనుమతులు ఉన్నాయంటూ వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఈ షాపులో కేవలం టీ మాత్రమే విక్రయించాలని అనుమతి ఇస్తే, అలా కాకుండా రహస్యంగా అనేక రకాల వ్యాపారాలు చేస్తున్నట్లు పరిశీలనలో తేలిందని చెప్పారు. కేవలం వ్యాపార దృక్పథంతో రోగుల నుంచి అధిక రేట్లను విక్రయిస్తున్నారన్నారు. నెఫ్రో ప్లస్ డయాలసిస్ కేంద్రం పరిసర ప్రాంతాలు కూడా అపరిశుభ్రంగా ఉండటంపై నెఫ్రో ప్లస్ నిర్వాహకులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేంద్రం పరిసర ప్రాంతం 200 గజాల ఖాళీ స్థలంలో పనికిరాని మూటలు, చెత్తాచెదారం, వృథా, అవుతున్న మంచి నీరుతో ఆ ప్రాంతమంతా కలుషితంగా మారిందన్నారు. ఈ ప్రాంతమంతా డంపింగ్ యార్డుగా మార్చారన్నారు. ఆసుపత్రిలో రోగులకు వైద్యం అందించడమే కాకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ షేక్ మహబూబ్ సుభాని

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌లను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ షేక్ మహబూబ్ సుభాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ నాడు-నేడు కింద నూతన భవనాల ఏర్పాటుతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని, విద్యకు ఆయన ఇస్తున్న ప్రాధాన్యత ఇప్పటి వరకు ఎవ్వరూ ఇవ్వలేదని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన, సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టారని అన్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ టెక్నాలజీతో కూడిన ట్యాబ్‌లు అందజేస్తున్నారని, దీని వల్ల విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరుస్తారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ వైస్ చైర్మన్ ఉన్నం సౌజన్య, కో ఆప్షన్ సభ్యులు బొక్కా ప్రసన్నకుమార్, మేకా దామేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు కనకదుర్గ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.పూర్ణచంద్రశేఖర్‌రావు, పాఠశాల సహాయకులు రాధాకృష్ణ, సయ్యద్ జాకీర్ హుస్సేన్, పల్లె దానయ్య, ఎస్.నిర్మలజ్యోతి, ఎం.సుభాషిణి, ఎస్.సుధ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలి

- ఎన్నికల మేనిఫెస్టోలో అన్ని పార్టీలు చేర్చాలి
- ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.వి.ఎస్.సాయిప్రసాద్
- ఆస్పత్రికి కంప్యూటర్ బహూకరణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసే విధంగా తమ ఎన్నికల మేనిఫెస్టోలో అంశంగా చేర్చాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.వి.ఎస్.సాయిప్రసాద్ అన్నారు. మంగళగిరి పట్టణానికి చెందిన దామర్ల నరిసింహారావు సతీమణి నాగమణి ఐరన్ బల్లలతోపాటు కంప్యూటర్‌ను అందజేశారు. సాయిప్రసాద్ మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి విషయంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. డాక్టర్ ఎం.ఎస్.ఎస్.కోటేశ్వరరావు వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో 1986లో మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించి ప్రారంభించారని అన్నారు. డీఎంఈ పరిధిలో ఉన్న ఈ ఆసుపత్రిని వైద్య విధాన పరిషత్‌కు మార్చాలని తాము కృషి చేస్తున్నామని, మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ గీతా పద్మజ మాట్లాడుతూ కొత్త భవనం నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య, ఎం.రవి, పి.బాలకృష్ణ, నాగేశ్వరరావు, మాస్టర్ రాజేష్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు స్నేహరాజ్, సీనియర్ అసిస్టెంట్ సికిందర్ పాల్గొన్నారు.